క్లుప్తంగా

భూసర్వేతో రైతులకు మేలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: గ్రామాలలో చేపడుతున్న సమగ్ర సర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని ఆర్డీఓ మోహన్‌దాస్, డివిజనల్ సర్వేయర్ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని బసినేపల్లి, హంప గ్రామాలలో భూసర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి నోటీసులు ఇచ్చారు. వారు మాట్లాడుతూ భూసర్వే చేసి పొలాలకు హద్దులు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. సర్వే పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బుధ, గురువారం డ్రోన్లతో భూసర్వే కార్యక్రమం చేపడతారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ నాగభూషణం, డీటీ నాగరాజులు పాల్గొన్నారు.

కార్మికుల కృషితోనే సంస్థ అభివృద్ధి



ఉద్యోగికి ప్రోత్సాహకంగా చెక్కును అందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం వెంకటరామం

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల సమష్టి కృషితోనే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని డిస్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వెంకటరామం పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గత జూన్ నెలలో అత్యుత్తమ సేవలందించి ఆయిల్ పొదుపు చేసిన డ్రైవర్లు శ్రీనివాసులు, జీఆర్ రెడ్డి, సూపర్ లగ్జరీ డ్రైవర్ దేవేంద్ర, ఇపీకే అవార్డుకు కండక్టర్లు గోపాల్, అయ్యమ్మ, స్టోర్ సూపర్ వైజర్ మూర్తి, మెకానిక్‌లు కేకే ప్రసాద్, శరనప్పలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను డీఈవీ వెంకటేశ్వర్లు, స్థానిక డిపో మేనేజర్ అమర్నాథ్, అసిస్టెంట్ మేనేజర్ జీవి నాగరాజులతో కలిసి మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని సూచించారు.

ఉప సర్పంచ్ మృతి



వెంకటలక్ష్మి (ఫైల్)

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ వెంకటలక్ష్మి (45) మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించింది. ఈమె గత కొద్ది రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలు లక్ష్మికి భర్త ఆనంద్, కూతురు, కుమారుడు ఉన్నారు.

మిర్చి రైతుల్లో గుబులు



రామళ్లకోటలో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట, బోయనపల్లె, చుట్టుప్రక్కల గ్రామాల పరిధిలో ఖరీఫ్‌లో నాటిన పచ్చి మిర్చి నారు సరైన ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామాల పరిధిలో గత ఏప్రిల్‌లో దాదాపు 2 వేల ఎకరాల్లో నారు నాటిన రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక మొక్కలు ఎదగకపోవడంతో పైర్లను తొలగించారు. రామళ్లకోటలోని నర్సరీలలో అధిక శాతం మంది నారును కొనుగోలు చేశారు. పైర్లను తొలగించిన తర్వాత తిరిగి ప్రస్తుత ఖరీఫ్‌లో సైతం అదే నర్సరీల నుంచి నారు కొని నాటుకున్నారు. ఆ నారు కూడా ఎదగకపోవడంతో మంగళవారం రైతులు గ్రామ పెద్ద, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామితో కలిసి నర్సరీ యజమానులతో చర్చించారు. నర్సరీలో నారు పోసిన విత్తనాలపై తమకు అనుమానాలున్నాయన్న రైతుల వాదన మేరకు.. నర్సరీల నిర్వాహకులు విత్తనాలు కొన్న కంపెనీల వివరాలు అందించేందుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులు ఆయా కంపెనీల వివరాలు, తాము నారు కొన్న బిల్లులను తీసుకుని సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. పంట నష్టానికి గల కారణాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

రూ. 2లక్షలు విరాళం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి మంగళవారం ఓ భక్తుడు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. హైదరాబాద్ వాస్తవ్యులు రాజుల సూర్యనారాయణరెడ్డి, రాజుల జోష్నారెడ్డి దంపతులు రూ.లక్షను రాజగోపుర నిర్మాణానికి దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. అలాగే రాజుల పునీత్ రెడ్డి పేరుపై రూ.లక్షను చెక్ రూపంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు,, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండును, స్వామివారి ఫొటోను అందజేశారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసనాగ్రహం



పత్తికొండలో ఆందోళన చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నిస్వార్థంగా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం నియమించిన వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తీరుకు నిరసనగా మంగళవారం పట్టణంలో వలటీర్లు ఆందోళన చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్ ధర్నా చేశారు. అనంతరం పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో వలంటీర్ల సంఘం నాయకులు నరేష్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనాకు భయపడి హైదరాబాద్‌లో దాక్కున్న పవన్‌కళ్యాణ్ ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వలంటీర్లకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక వలంటీర్లు పాల్గొన్నారు.

తుగ్గలి: వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం తుగ్గలిలో ప్రధన రహదారిపై నిరసన తెలిపి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్ల నిరసనకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. పింఛన్లు పొందుతున్న అవ్వతాతలు, వింతంతువులు, దివ్యాంగులను అడిగితే వలంటీర్ల సేవల గురించి చెబుతారన్నారు. తాము ఎటువంటి ప్యాకేజీ తీసుకోవడం లేదని ప్రభుత్వ పథకాలు, సేవలను సక్రమంగా లబ్ధిదారులకు చేరవేస్తూ గౌరవ వేతనం పొందుతున్నామని వలంటీర్లు అన్నారు. అనంతరం వలంటీర్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆలూరు: రాజకీయ లబ్ధి కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని స్థానిక వలంటీర్లు పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఇళ్లు తిరిగి కూరగాయాలు, మందులు, మాస్కులు పంపిణీ చేసిన విషయం పవన్ మరిచారా అని ప్రశ్నించారు.

ఆస్పరి: పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఆస్పరిలో వలంటీర్లు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. చిన్నహోతూరు గ్రామంలో సచివాలయం ముందు నిరసన తెలిపారు. పవన్‌కళ్యాణ్ నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు.



దేవనకొండలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



తుగ్గలిలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

దేవనకొండ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని జెడ్పీటీసీ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు దేవనకొండ బస్టాండులో వలంటీర్లతో కలిసి పవన్‌కళ్యాన దిష్టిబొమ్మను దహనం చేశారు.

పత్తికొండ రూరల్: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులతో పోల్చుతూ వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని హత్తిబెళగల్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ గ్రామ వలంటీర్ల హక్కుల సంఘం ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఆందోళన చేపట్టారు.

సేవకు సలాం



కోవిడ్ సమయంలో ప్రభుత్వం మంజూరుచేసిన రూ.వెయ్యి సాయం అందిస్తున్న వలంటీర్

గత 2020 -21లో కోవిడ్ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వలంటీర్ల ద్వారా పేదలకు రూ.వెయ్యి ఆర్థిక సాయంతో పాటు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆపద వేళలో పేదలకు ఆపన్న హస్తంలా వలంటీర్లు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి పింఛన్లు, ప్రభుత్వం సాయం అందించడంతో అప్పట్లో లబ్ధిదారులకు ఆర్థికంగా ఊరటనిచ్చింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో ఉన్న వారికి సైతం వలంటీర్లు అక్కడికే వెళ్లిపింఛన్‌లు అందించారు. లాక్‌డౌన్ సమయంలో వలంటీర్ల సేవలకు ప్రజలు సలాం కొట్టారు.

ఆర్థికంగా మేలు జరిగింది



ఉన్నఫలంగా లాక్‌డౌన్ పడింది. డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందిగా ఉండేది. మా ఏరియా వలంటీర్ అహ్మద్ ఉదయమే తలుపు తట్టి రూ.వెయ్యి రూపాయలు ఇచ్చాడు. ఎందుకు అని ప్రశ్నిస్తే.. పేదల కోసం ప్రభుత్వం నగదు మంజూరు చేసిందని చెప్పాడు. దీంతో ఆ రెండు నెలల్లో మా ఇల్లు గడిచింది. కోవిడ్ సమయంలో వలంటీర్ చేసిన సేవలు మరువలేం.

– జయశీలమ్మ, ఆలూరు

ప్రజాసేవే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



తాపలకొత్తూరులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: పక్షపాత వైఖరి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాపలకొత్తూరు, పులిచెర్ల, కటారుకొండ గ్రామాల్లో మంగళవారం రెండవ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. తనతోపాటు మండలస్థాయి అధికారులందరూ వెంట ఉన్నారని, ఏవైనా సమస్యలుంటే తెలపాలని కోరారు. తమ గ్రామానికి రహ దారి సౌకర్యం కల్పించాలని పులిచెర్ల వాసులు విన్నవించగా.. ఫారెస్టు అధికారుల నుంచి అనుమతులు రాకపోవడం వల్ల పనులు ఆలస్యమయ్యాయని, ఈ విషయాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫారెస్టు అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రహదారి ఏర్పాటు చేశాకే ఓట్లు అడుగుతామని చెప్పడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కటారుకొండ ఎస్టీ కాలనీలోని పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పిల్లలు దూరంగా వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని, తాపలకొత్తూరు గ్రామానికి డోన్ నుంచి వచ్చే రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ విశ్వమోహన్, నాయకులు సుకన్య, మాధవరావు, బ్రహ్మానంద రెడ్డి, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిమాధవరెడ్డి, రహుంతుల్లా, జయరామిరెడ్డి, రామచంద్రుడు, లక్ష్మన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయండి



ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణాలపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు పాఠశాలల్లో నాడు – నేడు కింద చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, ఎంఈఓ 2 మధుసుదన్‌రాజుతో కలిసి పట్టణంలోని వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో పాత భవనాలను, కొత్తగా భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నాడు – నేడు కింద రూ.72 లక్షలు మంజూరైనందున ఆ నిధులతో పనులు సత్వరం చేపట్టి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. ఆయా గదులను నిర్మిస్తే విద్యార్థుల సంఖ్యకు సరిపోతుందని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, హెచ్‌ఎం నాగభూషణ్ రెడ్డి, ఏఈ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఈ-శ్రమ్ కార్డులు

ఆలూరు రూరల్: కార్మిక శాఖ ఆధ్వర్యంలో అర్హులైన వారికి బుధవారం నుంచి ఉచితంగా ఈ-శ్రమ్ కార్డులు అందించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మండల కార్మిక శాఖ సహాయ అధికారి మహాలక్ష్మి ఆధ్వర్యంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఉచితంగా ఈ-శ్రమ్ కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బంది ఉంటారని, అర్హులైన వారు ఆధార్ కార్డు, ఫొటో తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ-శ్రమ్ కార్డు పొందిన వారు ఏదైనా ప్రమాదంలో గాయపడినా, మరణిస్తే నామినీకి ప్రభుత్వ సాయం అందుతుందన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

ఆలూరు రూరల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని పత్తికొండ డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ ప్రకాష్‌నాయుడు ఆదేశించారు. ఆయన మంగళవారం ఆలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు లీకేజీ కాకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 200 మొక్కలు నాటి పరిరక్షించాలని సూచించారు.

నిర్మాణాలు పూర్తి చేయండి

మద్దికెర: సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం మద్దికెరలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకేను పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

పక్కాగా ఓటరు నమోదు

తుగ్గలి: ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలని, 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు పరిశీలన, కొత్త ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి నెల రోజుల పాటు బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ ఆఖరు వరకు 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. తహసీల్దార్ రవి, డీటీ నిజాముద్దీన్, వీఆర్వోలు పాల్గొన్నారు.



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మద్దికెర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ స్పెషల్ సమ్మెర్ రివిజన్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు నమోదై ఉంటే విచారణ చేయాలన్నారు. వంద సంవత్సరాలు నిండిన ఓటర్లు ఉంటే మరోసారి పరిశీలించాలన్నారు. తహసీల్దార్ నాగభూషణం పాల్గొన్నారు.

వన్యప్రాణులకు హాని కలిగిస్తే చర్యలు



కోటేకల్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజస్వి

ఎమ్మిగనూరురూరల్: అడవుల్లో సంచరించే వన్యప్రాణులకు హాని తలపెట్టడం చట్టరీత్యా నేరమని ఆదోని ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజస్వి పేర్కొన్నారు. మంగళవారం కోటేకల్ గ్రామంలో ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఇటీవల గ్రామంలో ఓ మేకను చిరుత చంపి తినడం బాధాకరమని, ఆ రైతుకు పరిహారం అందజేస్తామని చెప్పారు. గ్రామస్తులు చిరుతకు హాని కలిగించాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదోని ఎఫ్ఎస్ఓ మనిందర్‌నాయుడు, కోటేకల్ ఫారెస్ట్ బీట్ అధికారిణి అనురాధ, ఆదోని ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వైద్యుల నియామకం

సాక్షి ఎఫెక్ట్

ఆలూరు రూరల్: ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తాత్కాలిక డాక్టర్లను ఉన్నతాధికారులు నియమించారు. సెలవుల్లో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు పేరిట సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. సెలవులో ఉన్న డాక్టర్లు తిరిగి విధుల్లో చేరే వరకు రోగులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వైద్యులను నియమించారు. పత్తికొండ పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ ఇర్ఫాన్‌తో పాటు మంగళవారం గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు, వైద్య సేవల కోసం ఆదోని నుంచి మరో గైనకాలజిస్టును అందుబాటులో ఉంచారు. తాత్కాలిక డాక్టర్ నియామకంపై గర్భిణులు, రోగులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



ఆలూరు సీహెచ్‌సీలో ఓపీ చూస్తున్న వైద్యులు

గర్భిణులకు స్కానింగ్ కష్టాలు



తగినన్ని కుర్చీలు లేకపోవడంతో నేలపై కూర్చొని నిరీక్షిస్తున్న గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల కోసం పెద్దసంఖ్యలో గర్భిణులు తరలివచ్చారు. ఓపీ, పేర్ల నమోదు కోసం క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. స్కానింగ్ పరీక్షలకు పేర్లు నమోదు చేసుకునే కేంద్రం వద్ద పూర్తి స్థాయిలో కుర్చీలు ఏర్పాటు చేయకపోవటంతో నేలపై, చెట్ల కింద, అరుగుపై కూర్చున్నారు. గర్భిణులు భారీగా తరలిరావడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. 515 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు. కుర్చీలు ఏర్పాటు చేశామని ఇంత మంది వస్తారని ఊహించలేదని చెప్పారు. డాక్టర్ ఫాతిమా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవ్వా పింఛన్ వస్తుందా?



ఎమ్మిగనూరు 23వ వార్డులో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అవ్వా పింఛన్ వస్తుందా? ఒకటో తేదీన డబ్బులు తెచ్చి ఇస్తున్నారా? అంటూ వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ, మహిళలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా? ఏమైనా సమస్యలున్నాయా? అంటూ ఆరా తీస్తూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్‌రెడ్డి, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, వీరేంద్ర, రాజశేఖర్, సునీల్‌కుమార్, షబ్బీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోమగనూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, భీమిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జన సంక్షేమానికే జగనన్న సురక్ష





కటారుకొండలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

కృష్ణగిరి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారుకలు సర్టిఫికెట్లను అందజేశారు. పులిచెర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి బాలింతలకు సీమంతం చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్త వేదావతిని సత్కరించారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు రోడ్డులోని 11, 12, 15వ వార్డుల సచివాలయంలో ప్రజలకు అవసరమైన పలు ధ్రువీకరణ పత్రాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, షాబుద్దీన్, కౌన్సిలర్ ఇషాక్‌తో కలిసి అందజేశారు.

తుగ్గలి: మండలంలోని జీ.ఎర్రగుడి, ఎద్దులదొడ్డి సచివాలయాల్లో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, సర్పంచ్‌లు వరలక్ష్మి, కమాల్‌బాషా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి చేతులమీదుగా ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామ సచివాలయం -2 పరిధిలో ఎంపీడీఓ అల్లబాకష్ ఆధ్వర్యంలో 145 మందికి, ముద్దనగేరి గ్రామంలో డీటీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం ద్వారా 90 మందికి వివిధ రకాల ధ్రువప్రతాలు పంపిణీ చేశారు.

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు, నగరూరు గ్రామాలలో సర్పంచులు హరికృష్ణ, సావిత్రమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిన్నహోరులో 250 మందికి, నగరూరులో 320 వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 100 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు.

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో ఎంపీడీఓ నరసింహమూర్తి,, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు.

గోనెగండ్ల: మండలంలోని హెచ్. కైరవాడి-1, కులుమాల గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సచివాలయం-1, -2లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 755 మంది లబ్ధిదారులకు మండల అధికారులు ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు, గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి చేతుల మీదుగా కుల, ఆదాయ, ఆర్‌ఓఆర్ తదితర ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

హాలహర్వి: మండలంలోని చింతకుంట సచివాలయం-2, కొక్కరచేడు గ్రామాల్లో తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించిన ప్రజలకు ధ్రువపత్రాల పంపిణీ, వివిధ సేవలందించారు.

దేవనకొండ: మండల కేంద్రంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు 531 ధ్రువపత్రాలను ఉచితంగా అందించారు.

కౌలు కార్డు ఇచ్చారు



ఈ చిత్రంలో కౌలుకార్డు చూపిస్తున్న వ్యక్తి పేరు గొల్ల గోపాల్. నందవరం మండలంలోని ముగతి గ్రామ నివాసి. ముగతి గ్రామంలో 4.34 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పత్తి పంటలను సాగుచేస్తున్నాడు. గతంలో కౌలు కార్డు తీసుకోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాడు. సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ ఇంటి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. గ్రామ సచివాలయంలో వీఆర్వోకు దరఖాస్తు చేశాడు. నాలుగు రోజుల్లోనే కౌలుకార్డు అందింది. వ్యయ ప్రయాసలు లేకుండా ఉచింతగా కౌలుకార్డు అందించడంపై సంతోషం వ్యక్తం చేశాడు.

– గొల్ల గోపాల్

ఎట్టకేలకు పరిష్కారం



మా ఇంట్లో నాన్న, అమ్మ, తమ్ముడు, చెల్లెలు నేను ఉండేవాళ్లం. రెండేళ్ల క్రితం నాకు వివాహం అయ్యింది. ఉమ్మడి ఆస్తి పదెకరాల పొలం ఉండడంతో రేషన్‌కార్డు రద్దయ్యింది. కుటుంబ విభజన ధ్రువపత్రాలు లేక పథకాలు అందడం లేదు. ఇప్పుడు ఎట్టకేలకు సమస్య పరిష్కారమైంది. రెండేళ్లుగా జరగని పని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా జరిగింది. సంక్షేమ పథకాలకు అర్హత లభించడం ఆనందంగా ఉంది.

– రంగస్వామి, రామాపురం